భయపడకుండా వచ్చే ఇబ్బందులు తెలియజేయాలి

ఎదులాపురం, ఏప్రిల్ 15 : విద్యార్థులు రుతుక్రమం జరిగే సమయంలో భయపడకుండా వచ్చే ఇబ్బందులు తల్లిదండ్రులు లేదా ఉపాధ్యాయులకు తెలియజేస్తే వారి సరైన సూచనలు చేస్తారని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. మంగళవారం ఆదిలాబాద్‌లోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో పింకిస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు శానిటరీ ప్యాడ్స్ పంపిణీ చేశారు. పింకిస్ ఫౌండేషన్ సభ్యులు అరుణ్, శాలిని ఫౌండేషన్ చేపడుతున్న పనులను అడిగి తెలుసుకొని శాలువాతో సన్మానించారు. అనంతరం ఫౌండేషన్ తరపున కలెక్టర్‌ను సత్కరించి సహకారానికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో డీఈవో శ్రీనివాస్, డీడబ్ల్యూవో మిల్క, డీఎంహెచ్‌వో రాథోడ్, నరేందర్ డిప్యూటీ డీఎంహెచ్‌వో సాధన, పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు, వైద్యులు పింకిస్ ఫౌండేషన్ ప్రతినిధులు కలలా అభిలాష్, ఉరేరాలు పాల్గొన్నారు.

బీసీల రిజర్వేషన్ పెంపు బిల్లును కేంద్రం ఆమోదించాలి

ఎదులాపురం, ఏప్రిల్ 15: రాష్ట్ర ప్రభుత్వం పంపిన 42శాతం బీసీ రిజర్వేషన్ పెంపు బిల్లును కేంద్ర ప్రభుత్వం వెంటనే ఆమోదించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆదిలాబాద్‌లోని బీసీ సంఘ భవనంలో స్థానిక ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ పెంపు, భవిష్యత్ కార్యాచరణపై బీసీ కుల సంఘం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన హాజరై బీసీ రిజర్వేషన్లతో పాటు హక్కులు, సమస్యల పరిష్కరం కోసం చేయాల్సిన పనుల గురించి దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చిక్కాల దత్తు, కలల శ్రీనివాస్, ఉపాధ్యక్షులు మేకల అశోక్, కాసర్ల శ్రీనివాస్, దాముక రవీందర్, ఎంప్లాయిస్ యూనియన్ కన్వీనర్ శ్రీనివాస్, కోకన్వీనర్ నర్ర నవీన్ యాదవ్, కోశాధికారి మురళి, మహిళా సంఘం నాయకురాళ్లు రమ, ఉమామహేశ్వరి, పద్మవతి, యువజన సంఘం కన్వీనర్ నరేశ్, ప్రశాంత్, సత్యనారాయణ పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం చోరీ

ఎదులాపురం, ఏప్రిల్ 15: ఆర్టీసీ బస్టాండ్ వద్ద ద్విచక్ర వాహనం చోరీకి గురైనట్లు టూ టౌన్ ఎస్ఐ విష్ణుప్రకాశ్ తెలిపారు. ఈ నెల 12వ తేదీన ఉదయం సుభాష్‌నగర్‌కు చెందిన షాభాష్ ద్విచక్ర వాహనం పార్కింగ్ చేసి నిర్మల్ జిల్లాకు వెళ్లి ఆదిలాబాద్‌కు తిరిగి వచ్చాడు. పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనం కనిపించలేదు. బాధితుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కలిగి ఉండాలి

జైనథ్, ఏప్రిల్ 15 : ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కలిగి ఉండాలని జైనథ్ ఏపీఎం నాగుల భగవాండ్లు అన్నారు. మంగళవారం భోరజ్ మండలంలోని సిర్సన్న(జే) గ్రామంలో మహిళా రైతులకు నిర్వహించిన ఎన్‌పీఎం అవగాహన సదస్సుకు ఆయన హాజరై మాట్లాడారు. రైతులు తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి సాధించాలని అన్నారు. ఆవు పేడ ఇతర సేంద్రియ ఎరువులు వాడాలన్నారు. కార్యక్రమంలో సీసీ నాందేవ్, సీఆర్పీలు ఆశన్న, భాగ్యలక్ష్మి, కూర, కరంజి, సిర్సన్న(జే) గ్రామాల రైతులు పాల్గొన్నారు.

మైనార్టీల అభ్యున్నతికి కృషి చేస్తాం

ఎదులాపురం, ఏప్రిల్ 15 : మైనార్టీల అభ్యున్నతితో పాటు సామాజిక కార్యక్రమాలను మరింత విస్తృతం చేయడానికి సభ్యత్వ నమోదు ముమ్మరంగా చేపడుతున్నామని జమీయత్ ఉల్మాయే హింద్ సంఘం జిల్లా అధ్యక్షుడు హఫీజ్ అబుబాకర్ అన్నారు. మంగళవారం ఆదిలాబాద్‌లోని సంఘం కార్యాలయంలో సభ్యత్వ నమోదు డ్రైవ్ ప్రారంభించారు. కార్యక్రమంలో సభ్యులు మంజూర్, అస్లం, అబుజర్, రిజ్వాన్, షేక్ అహ్మద్, ఫైసల్ పాల్గొన్నారు.

వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత

కుంటగూడ అటవీ ప్రాంతంలో వన్యప్రాణుల కోసం నీళ్లు నింపుతున్న కూలీలు

ఇచ్చోడ(సిరికొండ), ఏప్రిల్ 15: వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత అని పాలవాగు బీట్ ఆఫీసర్ రాథోడ్ సంతోష్ అన్నారు. మంగళవారం ఆదిలాబాద్ జిల్లా సిరికొండ మండలంలోని కవ్వాల్ టైగర్ జోన్ సిరిచెల్మ కేటీఆర్ జోన్‌లోని పాలవాగు బీట్‌లో పిట్ క్లీనింగ్, వాటర్ ఫిల్లింగ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండకాలంలో అడవిలోని వన్యప్రాణుల కోసం నీటి సౌకర్యం ఏర్పాటు చేశామన్నారు. వన్యప్రాణులకు హాని కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అటవీ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో బేస్ క్యాంపు సిబ్బంది, కూలీలు పాల్గొన్నారు.

ఉట్నూర్‌లో కెరీర్ గైడెన్స్ సెమినార్

ఉట్నూర్, ఏప్రిల్ 15: ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్‌లోని హెచ్‌కేజీఎన్ కన్వెన్షన్ హాల్‌లో సన్‌రైస్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులకు ఈ నెల 18వ తేదీన సాయంత్రం 5 గంటలకు కెరీర్ గైడెన్స్ సెమినార్ నిర్వహించనున్నట్లు సంస్థ ప్రతినిధులు గోపాల్ నాయక్, తలైవా బానోత్ రాజ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని సన్‌రైస్ ఎడ్యుకేషనల్ హబ్ ద్వారా విద్యార్థులకు ఉత్తమ విద్య అందించడం జరుగుతుందని పేర్కొన్నారు.

వనజీవి రామయ్యకు నివాళి

ఉట్నూర్‌రూరల్, ఏప్రిల్ 15 : ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్‌లో మంగళవారం పద్మశ్రీ అవార్డు గ్రహీత, వనజీవి రామయ్యకు శాలివాహన కుమ్మర మండల కమిటీ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు పాల్గొన్నారు.

PUBLIC NOTICE

General public are hereby informed that my client **M/S Shriram Finance Ltd, Bhainsa Branch, Dist. Nirmal** agreed to accord Loan to **Macharla Suresh** S/o. Muthanna, Age 42 Yrs, Occ:Business R/o.H.No.3-62, Hampoli (V), Bhainsa (M), Nirmal (Dist) mortgage of the schedule referred plot property. The above prospective loanee agreed to create first charge against schedule property mentioned below in favor of my client company. If any person having any title, claim, or objection of whatsoever nature may put forth their claims before me within **7 days** of this notice. The objections raised afterwards shall be deemed to be 'Waived" and not binding on my client Company and my client shall proceed further for according above loan by Mortgage of the schedule property.

Hence this notice.

SCHEDULE OF THE PROPERTY

That the Agriculture dry land in Sy.No.1/ఎా1, admeasuring (01.00) Acre (0.11) Guntas out of which 133.33 Sq.Yards equal to 1200.00 Sq.feets to 111.48 Sq.Meters situated at Hampoli-K Village Mandal Bhainsa, and District Nirmal 504103 **Bounded as below: East:** 18 Feet wide Road, **West:** Land of Laxman **North:** Land of Vendor Sainath, **South:** 18 Feet wide Road.

Sd/- R.JAGADISHWER RAO, Advocate
Subhashnagar, Nizamabad, Cell:9848094409

అగ్నిప్రమాదాలు సంభవిస్తే సమాచారం అందించాలి

- ఆదిలాబాద్ ఫైర్ ఆఫీసర్ జైత్రాం
- ఆకట్టుకున్న అగ్నిమాపక శాఖ విన్యాసాలు

ఎదులాపురం, ఏప్రిల్ 15: అగ్నిప్రమాదాలు సంభవిస్తే వెంటనే అగ్నిమాపక శాఖకు సమాచారం అందించాలని ఫైర్ ఆఫీసర్ జైత్రాం సూచించారు. రెండవ రోజు మంగళవారం అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ఆదిలాబాద్‌లోని రైల్వే స్టేషన్ వద్ద అగ్నిమాపక శాఖ సిబ్బంది నిర్వహించిన విన్యాసాల్లో ప్రమాదాలు జరిగినప్పుడు మంటలు ఎలా ఆర్పాలో ప్రదర్శించిన ప్రజలకు అవగాహన కల్పించారు. నంతరం వారోత్సవాల కరపత్రాలు విడుదల చేసి ప్రజలకు అందజేశారు. అగ్నిమాపక శాఖ సిబ్బంది త్యాగాలను తెలియజేయడంలో భాగంగా వారోత్సవాలను నిర్వహిస్తున్నామని ఫైర్ ఆఫీసర్ జైత్రాం తెలిపారు. కార్యక్రమంలో అగ్నిమాపక శాఖ సిబ్బంది, ఎస్ఈ, రైల్వే ఏఎస్ఐఐ వినోద్, తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చోడ, ఏప్రిల్ 15: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడలో సిబ్బంది అగ్నిప్రమాదాల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. సిరిచెల్మ చౌరస్తా, అంబేద్కర్, కుమ్రం భీం చౌక్‌లో డయల్ 101 గురించి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఫైర్ ఆఫీసర్ ఎం అశోక్, లీడ్ ఫైర్ మెన్ దేవేందర్, ఫైర్‌మెన్ విజయ్ కుమార్, అంజు, అచ్యుత్ రెడ్డి, డీపీవో శివాజీ పాల్గొన్నారు.

ఎదులాపురం: రైల్వేస్టేషన్‌లో విన్యాసాలు ప్రదర్శిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

ఇచ్చోడ: కరపత్రాలు పంపిణీ చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

నిర్మల్‌అర్బన్: పోస్టర్ విడుదల చేస్తున్న అగ్నిమాపక శాఖ అధికారులు

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

నిర్మల్ అర్బన్, ఏప్రిల్ 15 : అగ్ని ప్రమాదాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అగ్నిమాపక శాఖ అధికారి రాజలింగం సూచించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మంగళవారం నిర్మల్‌లో అగ్ని ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. దుకాణాలు, పెట్రోల్ బంకులు, షాపింగ్ మాల్స్, సినిమా థియేటర్లలో పోస్టర్లను అతికించి ప్రమాదాలు జరుగకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు వెంటనే ఫైర్ అధికారులకు సమాచారం అందించాలని ఫైర్ ఇంజన్ వచ్చే దాకా ఎదురుచూడకుండా మంటలను ఆర్పే ప్రయత్నం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఫైర్ సిబ్బంది సుభాష్, రమేశ్, హుస్సేన్ షా, ఫిర్దోస్ పాల్గొన్నారు.

భైంసా, ఏప్రిల్ 15 :నిర్మల్ జిల్లా భైంసాలోని ఆర్టీసీ బస్టాండ్‌లో అగ్నిమాపక శాఖ అధికారులు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలోఅగ్నిమాపక శాఖ అధికారి రవి, సిబ్బంది పాల్గొన్నారు.

ఖానాపూర్, ఏప్రిల్ 15: నిర్మల్ జిల్లా ఖానాపూర్‌లోని ఎన్టీఆర్ చౌరస్తాలో అగ్నిమాపక కేంద్రాధికారి జావేద్ అలీ ఆధ్వర్యంలో అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహించారు. అగ్ని ప్రమాదాలు, విపత్తుల సమయంలో అప్రమత్తత, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది ఖదీర్ ఖాన్, మహేందర్, అనిల్, వెంకటేశ్, సాయిచరణ్, శ్రీకాంత్, కృష్ణ పాల్గొన్నారు.

రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు



బోథ్: జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జాదవ్ అనిల్

బోథ్, ఏప్రిల్ 15 : రైతులు దళారులకు పంటలు అమ్మి మోసపోవద్దని బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ అన్నారు. మంగళవారం ఆదిలాబాద్ జిల్లా బోథ్‌లోని మార్కెట్ యార్డులో మార్క్‌ఫెడ్, సహకార సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కల్పిస్తూ జొన్నల కొనుగోలు చేపడుతారన్నారు. జొన్న పంట పండించిన రైతులు నేరుగా మార్కెట్ యార్డుకు తీసుకు వచ్చి విక్రయించుకోవాలని సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా కొనుగోలు చేయాలని అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో డీఎం ప్రవీణ్ రెడ్డి, ఏఎంసీ చైర్మన్ గంగారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ ప్రశాంత్, సీఈవో గోలి స్వామి, వివిధ పార్టీల నాయకులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం

మాట్లాడుతున్న కినక శంభు స్వామి మహారాజ్

ఇచ్చోడ, ఏప్రిల్ 15: క్రీడల్లో గెలుపోటములు సహజమని, క్రీడా స్ఫూర్తిని చాటాలని కినక శంభు స్వామి మహారాజ్ అన్నారు. ఆదిలాబాద్ జిల్లా సిరికొండ మండలం వాయిపేట్ గ్రామంలోని జై మహంకాళి దేవస్థానంలో రెండు రోజుల నుంచి నిర్వహించిన వాలీబాల్, కబడ్డీ పోటీలు మంగళవారం ముగిశాయి. విజేతలకు కినక శంభు స్వామి మహారాజ్ బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో గ్రామ పటేల్ పెందూర్ బండు, సర్పంచ్ జలపతి, మార్కెట్ డైరెక్టర్ ఆనంద్ రావ్, పెందూర్ భుజంగ్ రావ్, కినక పరశురాం, లక్ష్మణ్ స్వామి, పోయం బారిక్ రావ్ పాల్గొన్నారు.

నీటి సమస్య పరిష్కరించండి

ఉట్నూర్, ఏప్రిల్ 15 : గిరిజన గ్రామాల్లో నెలకొన్న నీటి సమస్యను పరిష్కరించాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి ఆత్రం తనుష్ ఉట్నూర్‌లోని క్యాంపు కార్యాలయంలో ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తాను కలిసి వినతిపత్రం అందజేశారు. గాదిగూడ మండలంలోని బొజ్జుగూడ, రూపాపూర్, మోకాశిగూడ, పర్సువాడ(బీ), ఇంద్రవెల్లి మండంలోని మామిడిగూడ(బీ),(జీ), గ్రామాల్లో నీటి సమస్య నెలకొందని తెలిపారు. సర్వే చేయించి నీటి సౌకర్యం కల్పించడానికి బోర్లు మంజూరు చేయాలని కోరారు. ఇక్కడ నాయకులు సక్కు, నగేశ్, లచ్చు, లింగు, నగేశ్, విలాస్ ఉన్నారు.

ప్రజా భద్రత కోసమే కమ్యునిటీ కాంట్రాక్ట్ ప్రోగ్రాం

లక్ష్మణచాంద, ఏప్రిల్ 15: ప్రజా భద్రత కోసమే కమ్యునిటీ కాంట్రాక్ట్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్లు డీఎస్పీ రాజేశ్‌మీనా పేర్కొన్నారు. మంగళవారం నిర్మల్ జిల్లా లక్ష్మణచాంద మండలంలోని మునిపల్లి గ్రామంలో కమ్యునిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. 90 ద్విచక్ర వాహనాలను పట్టుకున్నారు. సరియైన ధ్రువపత్రాలు లేని వాటికి జరిమానా విధించారు. కార్యక్రమంలో సోన్ సీఐ గోవర్ధన్ రెడ్డి, ఎస్ఐ మాలిక్ రహమాన్, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ కార్యాలయం తనిఖీ

నర్సాపూర్(జీ), ఏప్రిల్ 15 : నిర్మల జిల్లా నర్సాపూర్(జీ)లోని గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని మంగళవారం డీఎల్‌పీవో అజీజ్ ఖాన్ తనిఖీ చేశారు. పంచాయతీ, ఇంటి పన్నులకు సంబంధించిన రికార్డులు పరిశీలించారు. పంచాయతీకి సంబంధించిన రికార్డులను ఎప్పటికప్పుడు నమోదు చేసుకోవాలని కార్యదర్శి రాథోడ్ కైలాస్‌కు సూచించారు. ఆయన వెంట ఎంపీవో తిరుపతి రెడ్డి, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

నాలుగేళ్ల ధ్రువిత్ అద్భుతం

నర్సాపూర్ (జీ), ఏప్రిల్ 15 : నిర్మల్ జిల్లా నర్సాపూర్(జీ) మండలంలోని డొంగుర్గాం గ్రామానికి చెందిన గంజాల భూమేశ్, భాగ్యలక్ష్మి దంపతుల కుమారుడు గంజాల ధ్రువిత్ నాలుగేళ్ల వయసులోనే అద్భుత ప్రతిభను ప్రదర్శించాడు. విన్నర్స్ పాఠశాలలో ఎల్‌కేజీ చదువుతున్న చిన్నారి 50 రసాయన మూలకాలను కేవలం 35 సెకన్లలో స్పష్టంగా చదవడం గమనార్హం. ధ్రువిత్‌ను పాఠశాల యాజమాన్యం ప్రత్యేకంగా అభినందించారు.

క్వింటల్ జొన్నల మద్దతు ధర రూ.3771

ఎదులాపురం, ఏప్రిల్ 15: రైతుల దగ్గర నుంచి క్వింటల్ జొన్నలు ప్రభుత్వ మద్దతు ధర రూ.3771తో కొనుగోలు చేయాలని కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆదిలాబాద్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో జొన్నల కొనుగోలుపై అనుబంధ శాఖల సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జొన్నల కొనుగోలులో రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా సమన్వయంగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి కొనుగోలు చేపట్టాలని సూచించారు. జొన్నల సేకరణ, కొనుగోలులో ప్రాథమిక వ్యవసాయ సంఘాలు, మార్క్‌ఫెడ్, పర్యవేక్షణ అధికారులు జిల్లా మార్కెటింగ్, వ్యవసాయ, సహకార అధికారులు సమక్షంలో జరగనున్నాయన్నారు. జిల్లాలో 13 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించడం జరిగిందన్నారు. సబ్ కలెక్టర్, ఉట్నూర్ రెవెన్యూ డివిజన్, ఆదిలాబాద్ అధికారులు జిల్లా బార్డర్ చెక్ పోస్ట్‌లు మార్కెటింగ్, రెవెన్యూ, పోలీసు శాఖ ద్వారా విజిలెన్స్ టీమ్ ఏర్పాటు చేసి సరిహద్దు రాష్ట్రాల నుంచి అక్రమంగా జొన్న సరుకు రాకుండా అరికట్టాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్యామలాదేవి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మతకల్లాలు సృష్టించేందుకు యత్నించిన వ్యక్తిపై కేసు

ఎదులాపురం, ఏప్రిల్ 15: మతకల్లాలు సృష్టించేందుకు యత్నించిన వ్యక్తిపై మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూ టౌన్ సీఐ కరుణాకర్ రావ్ తెలిపారు. ఈ నెల 13వ తేదీన నోట్లో కత్తి పెట్టుకుని ప్రజలను భయభ్రాంతులను గురి చేసి, డబ్బులు వసూలు చేసే బంగారిగూడకు చెందిన షేక్ సలీం అలియాస్ కైంచి సలీంను రూరల్ పోలీస్ స్టేషన్‌లో అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన విషయం తెలిసిందే. ప్రదర్శనలు చేస్తూ వీడియోలు పోస్ట్ చేసిన కారణంగా కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు. అయితే ఆదిలాబాద్‌లోని ఖుర్షిద్‌నగర్‌కు చెందిన షేక్ ఇర్ఫాన్ సిల్సిలా పేరు గల వాట్సాప్ గ్రూప్‌లో వాయిస్ మెసేజ్‌తో పాటు, సాధారణ మెసేజ్‌లు పంపాడు. షేక్ సలీం అలియాస్ కైంచి సలీంను పోలీసులు ఎలా అరెస్టు చేస్తారు. రెండు వర్గాల మధ్య విభేదాలు సృష్టించి మతకల్లో సృష్టించాలని ఉద్దేశంతో పోలీసులను టార్గెట్ చేస్తూ వాట్సాప్ గ్రూపుల్లో మెసేజ్‌లు ఫార్వర్డ్ చేసినందుకుగాను షేక్ ఇర్ఫాన్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ద్విచక్రవాహనాలు ఢీ: ముగ్గురికి గాయాలు

నర్సాపూర్ (జీ), ఏప్రిల్ 15 : నిర్మల్ జిల్లా నర్సాపూర్(జీ) మండలంలోని నసీరాబాద్ గ్రామ 61వ జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి ద్విచక్రవాహనాలు ఢీ కొన్న ఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. దిలావర్‌పూర్ మండలం ఒడ్డెపల్లి గ్రామానికి చెందిన కుంచపు గంగామణి, సురేశ్ దంపతులు తమ పిల్లలతో కలిసి ద్విచక్రవాహనంపై కుందాపూర్ ఎల్లమ్మ వద్దకు వెళ్లి తిరిగి ఇంటికి వెళ్తున్నారు. ఈ క్రమంలో నర్సాపూర్ (జీ) గ్రామానికి చెందిన జావేద్ ద్విచక్రవాహనంపై తన కొడుకుతో దిలావర్‌పూర్ వెళ్తుండగా నసీరాబాద్ గ్రామ 61వ జాతీయ రహదారిపై సురేశ్ ద్విచక్రవాహనాన్ని వెనుక నుంచి ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో గంగామణి, జావేద్, జావేద్ కొడుకుకు గాయాలయ్యాయి.

బెల్ట్ షాపుపై దాడి

ఎదులాపురం, ఏప్రిల్ 15: ఆదిలాబాద్‌లో వడ్డార కాలనీలో ఏ రాజు బెల్ట్‌షాపుపై మంగళవారం టూ టౌన్ పోలీసులు దాడి చేశారు. అతని వద్ద నుంచి రూ.2200 విలువ గల మూడు లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నారు. అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మొక్కలతో కళ కళ లాడుతున్న నర్సరీ

గోసంపల్లె నర్సరీలో కొత్తగా తెచ్చిన మొక్కలు

ఖానాపూర్ రూరల్, ఏప్రిల్ 15: ఖానాపూర్ మండలంలోని గోడలపంపు, గోసంపల్లెతో పాటు తదితర గ్రామాల్లో ఏర్పాటు చేసిన నర్సరీల్లో మొక్కల పెంపకాలు వనమహోత్సవానికి అడ్డుకట్ట వేసున్నట్లు సోమవారం నమస్తే తెలంగాణ ప్రచురితమైన నామమాత్రంగా నర్సిరీల పెంపకం అనే కథనానికి మండలాధికారులు స్పందించారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు మండాలాధికారులు గ్రామాలకు తరలి వెళ్లారు. సంబంధిత ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్‌తో మొక్కలు విక్రయించి 5వేల మొక్కల వరకు తెప్పించి నర్సరీల్లో ఉంచారు. వనమహోత్సవానికి మొక్కలు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో సునీత, ఎంపీవో రత్నకర్ రావు, కార్యదర్శి సాయినాథ్ పాల్గొన్నారు.

ఎట్టకేలకు బేల పీహెచ్‌సీలో ల్యాబ్ టెక్నీషియన్

బేలలో ల్యాబ్ టెక్నీషియన్‌గా బాధ్యతలు చేపట్టిన సుప్రజ

బేల, ఏప్రిల్ 15 : కొన్ని ఏళ్లుగా బేల పీహెచ్‌సీలో ల్యాబ్ టెక్నీషియన్ లేక ఇబ్బంది పడ్డ ప్రజలకు అందుబాటులోకి ల్యాబ్ టెక్నీషియన్ వచ్చినట్లు డాక్టర్ వంశీ కృష్ణ తెలిపారు. మార్చి 29వ తేదీన నమస్తే తెలంగాణలో ప్రచురితమైన అంతంతే సర్కారు వైద్యం కథనానికి జిల్లా అధికారులు స్పందించారు. బేలలో ఉన్న ల్యాబ్ టెక్నీషియన్ డిప్యుటేషన్‌పై ఆదిలాబాద్‌లో విధులు నిర్వహిస్తున్న సుప్రజను తిరిగి మంగళవారం బేల పీహెచ్‌సీకి పంపించగా బాధ్యతలు స్వీకరించారు. దీంతో మండల ప్రజలు, గర్భిణులకు ల్యాబ్ సేవలు అందుబాటులోకి వచ్చాయి. అలాగే బేల పీహెచ్‌సీలో ఖాళీగా ఉన్న పోస్టులను కూడా భర్తీ చేయాలని మండలవాసులు కోరుతున్నారు.

వేసవి కాలంలో జాగ్రత్తలు తీసుకోవాలి

దస్తురాబాద్, ఏప్రిల్ 15 : వేసవి కాలంలో వడదెబ్బ తగలకుండా పలు జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్‌ఈవో శైలేందర్ కన్నయ్య ప్రజలకు సూచించారు. నిర్మల్ జిల్లా దస్తురాబాద్ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఆకొండపేట ప్రజలకు వేసవి కాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ప్రజలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది మల్లేశ్, సంతోష్, ఆశ కార్యకర్త భారతి పాల్గొన్నారు.

27న మోడల్ స్కూల్ ఎంట్రన్స్ టెస్ట్

కుంటాల, ఏప్రిల్ 15 : నిర్మల్ జిల్లా కుంటాల ఆదర్శ పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి 6 నుంచి 10 తరగతి అడ్మిషన్ల కోసం ఈ నెల 27వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ కాసు నవీన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. www.telanganams.cgg.gov.in నుంచి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని పేర్కొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

భైంసా, ఏప్రిల్ 15 : నిర్మల్ జిల్లా భైంసాలోన కమల జన్నింగ్ ఫ్యాక్టరీలో మాజీ ఎమ్మెల్యే నారాయణ రావు పటేల్ మంగళవారం పలువరు లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేశారు. గంగారెడ్డికి రూ. 60 వేలు, తబస్సు బేగం రూ.22 వేలు, అజర్‌అలీ రూ. 60 వేలు, అనీసా బేగం రూ.19 వేలు, అభిలాష రెడ్డి రూ.35 వేలు, గణపతి రూ. 25 వేలు, హరిత రూ. 60 వేలు చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు మజ్జిగ..

భైంసా, ఏప్రిల్ 15 : ఆర్టీసీ ఉద్యోగులకు మంగళవారం మజ్జిగను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డీఎం హరిప్రసాద్ మాట్లాడుతూ ఎండల తీవ్రత నుంచి ఉపశమనం పొందడానికి మజ్జిగను పంపిణీ చేసినట్లు తెలిపారు.

మున్సిపల్ కమిషనర్, సబ్ రిజిస్ట్రార్లపై చర్యలు తీసుకోవాలి

భైంసా, ఏప్రిల్ 15 : నిర్మల్ జిల్లా భైంసాలోని ప్రభుత్వ, దేవాలయ భూములకు ఎల్ఆర్ఎస్ పేరుపై ప్రభుత్వం ఫీజు వసూలు చేస్తూ అక్రమ రిజిస్ట్రేషన్ చేయడంలో అనుకూలంగా పని చేస్తున్న మున్సిపల్ కమిషనర్, సబ్ రిజిస్ట్రార్లపై చర్యలు తీసుకోవాలని మాజీ మున్సిపల్ కౌన్సిలర్ కపిల్ షిందే ఆర్డీవో సిబ్బందికి మంగళవారం వినతిపత్రం అందజేశారు.

వేర్వేరు ఇళ్లలో చోరీ

కడెం, ఏప్రిల్ 15 : నిర్మల్ జిలా కడెం మండలంలోని లింగాపూర్ గ్రామానికి చెందిన పడాల గంగవ్వ ఇంట్లో దొంగతనం జరిగినట్లు ఎస్ఐ కృష్ణసాగర్‌రెడ్డి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం..గంగవ్వ సోమవారం ఇంటికి తాళం వేసి తన బంధువుల ఇంటికి వెళ్లింది. రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఆమె ఇంట్లో చొరబడి 3 తులాల బంగారం, 10 తులాల వెండి, రూ.లక్ష 50 వేల నగదు బీరువా పగులగొట్టి అపహరించారు. గంగవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నిర్మల్ చైన్‌గేట్, ఏప్రిల్ 15 : నిర్మల్‌లో మంగళవారం రెండు ఇళ్లలో దొంగలు చోరీకి పాల్పడ్డారు. వివరాలక